సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.16-22

# "రంది" తెలంగాణకథ (2013)- వస్తువైవిధ్యం

**గొంగులూరి కృష్ణవేణి**
పరిశోధక విద్యార్థిని,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

**ఉపోద్ఘాతం:**

ఇయ్యాలా 'తెలంగాణ' అంటే లోకం మొత్తానికి ఎర్కనే. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంగానో, అమరుల త్యాగానికో, రాష్ట్ర సాధనకై పోరాటం చేసినందుకో, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినందుకో, అందరికీ తెలుసు. ఉద్యమం, పోరాటాలు ఒక దిక్కయితే, తెలంగాణ భాష, సాహిత్యం మరోపక్క బేరీజు వేసుకోవాలి. కష్టమో, నష్టమో పోరాడి, కొట్లాడి మనం తెలంగాణ తెచ్చుకున్నాం. ఇగ అండ్ల కూడా సమస్యలు మస్తుగనే ఉన్నాయి. అన్ని మనం అనుకున్నట్లు సక్కగా చేసుకుంటాం. కానీ ఇంకో దిక్కు మన భాషను, సంస్కృతిని, సంబరాలను అన్నింటిని మనతోపాటు మనముందు తరాలకు ఎర్కచేసే బాధ్యత మనమీద ఉంది. కవితలల్ల, పద్యాలల్ల ఎట్లనన్నా సరేగాని మన ఎన్కటోల్ల గురించి మన ముందోల్లకు చెప్పాలి.తెలంగాణ రాకముందు నుంచీ మనోళ్లకు అన్నింట్లో అన్నాలమే జరిగింది. కొలువులల్ల, భూములల్ల, చదువులల్ల అన్నింట్లో ఎన్కబడ్డము. మన కవులకు, రచయితలకు కూడా అన్యాయమే జరిగింది. ఎంతసేపు తెలంగాణేతరులు రాసిన కథలు, రచనలే అచ్చయ్యేటటువంటివి. మనవి అన్ని వివక్షకు గురైనవి. ఇద్దరో ముగ్గురో వీళ్లందర్ని నిలదొక్కుకొని, ఎన్నో కష్టాలు నష్టాలకు ఓర్చుకొని కవులుగా నిలబడ్డారు.

"కథలు అచ్చేసే పత్రికలు, వాటి సంపాదకులు, విమర్శకులు, కథాకారులు, ఆనాటి సంకలనకర్తలు అందరూ కట్టకట్టుకుని తెలంగాణ కథా సాహిత్యానికి అడ్డుగోడగా నిలబడ్డారు. తొలిదశలో తెలంగాణ భాషలో రాసిన సురవౌళి, వట్టికోట ఆళ్వారుస్వామి, గూడూరి సీతారాంలు తర్వాతి దశలో కథలు రాయడం మానేసేలా చేసింద్రు. ఒక విధంగా చెప్పాలంటే కథకులుగా వాళ్లను హత్యజేసింద్రు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తర్వాతి కాలంలో దేవరాజు మహారాజు, విద్యాసాగర్ లాంటి వాండ్లు మొదట తెలంగాణ భాషలో రాసింద్రు. అయితే వాండ్లకు సుత గౌరవం దక్కలె. ఆ తర్వాత అల్లం రాజయ్య తెలంగాణ భాషలో కతలు రాస్తే గదేందని 'కొడవళ్లతోటి క్వశ్చన్ మార్కులు పెట్టింద్రు".

**కీలకపదాలు:** తెలంగాణ కథ,వస్తువైవిధ్యం,కవులు, తెలంగాణ భాష, కథలు

**"రంది" కథలు -వస్తు వైవిధ్యం:**

ఈ కాలంలో రాష్ట్రం వచ్చినంక మన కవుల్ని, రచయితల్ని లెంకి మీటింగులు సభలు పెట్టుకుంటూ అందరినీ పైకి దెస్తున్నారు. 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం కొంతమంది కథకుల్ని బయటకు తెచ్చేందుకు కృషి చేసింది. 2013లో ఇంతకుముందు అచ్చయిన కథలల్ల 18కథలను తీసుకొని "రంది" రూపంలో 2014 లో మన ముందుకు తీసుకొచ్చిను.

ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.16-22


"విధ్వంసం అవుతున్నపల్లెలు, చిద్రమైన వృత్తులు, సాగని వ్యవసాయం, నీళ్లగోస, దళితులపై దమనకాండ, వలస బతుకులు, అస్తిత్వసోయి, మతసంఘర్షణ, నోస్టాల్జియా, ఆత్మగౌరవ పతాకం అన్నీ ఈ కథల్లో రూపుదిద్దుకున్నై. వర్తమాన తెలంగాణ సమాజం పడుతున్న రందిని ఈ కథలు చిత్రికగట్టినై. ఇందులో సీనియర్ కథకులకంటె యువ కథకులే ఎక్కువమంది ఉన్నరు. భవిష్యత్తెలంగాణ కథారంగాన్ని వెలిగిస్తామంటూ వీరి కథలు వాగ్దానం చేస్తున్నై".

**1). విధ్వంసమవుతున్న పల్లెలు:**

పల్లెల్లో ఉండే ప్రేమలే వేరు. చిన్న కష్టమొచ్చినా అందరొచ్చి అర్సుకుని తల్లడిల్లిపోయేటోలు. కానీ ఇప్పుడు వాళ్లకు ఆదరువులేక బతుకుదెరువు ఆగమైపోతుంది. వానలు పడక, నీళ్లులేక, ఎండిపోతున్న పంటలను చూసి రైతులు కూడా ఎండిపోతున్నరు. భూములను అప్పూటం బ్రోకర్లతో కూడి ఎంతోకొంతకు అమ్ముకుని బతుకులు ఎళ్లదీస్తున్నరు. ఊరికి ఊరికి మధ్య పచ్చని పంట పొలాలతో, అడవితో దూరం ఉండేది. ఇప్పుడు ఏది ఊరో, ఏది పట్నమో అర్థంకాని విధంగా మారిపోయింది.

'రంది' కథా సంపుటిలో కూడా పల్లెల గురించి, స్థితిగతుల గురించి పెంజీకటి, ఉసురు, మర్రిచెట్టు అనే కథలల్ల సూడొచ్చు. 'పెంజీకటి' కథను 'పసునూరి రవీందర్' అన్న ఒక నాటకం వేసే రామస్వామి పాత్రద్వారా 40 ఏండ్ల కిందట పల్లెలు ఎట్లున్నయో సూపిచ్చిండు.

"ఎట్లున్న బతుకు ఎట్లయిపాయెనన్న రంది.
సావుదాలకు కనీసం 'నా అనే' జనమే లేరు.
అయినే కాదు, అయినతో ఆడినోళ్ళు, పాడినోళ్ళు కూడా ఎవ్వలు నిమ్మలంగ లేరు. అందరిదీ ఆకలిపోరాటమే".

సిన్మాలు, టీవీలు రాకమున్పు వీధినాటకాలతోనే పల్లెల్లో పొద్దుపొయ్యేది. పొద్దుమీకి ఎవుసం కాడికెంచి వచ్చి కుసుంటే తెల్లారిందాకా నాటకాలు సాగేటివి. ఆడనే కుసునెటోల్లు, తినటోల్లు, పండుకునేటోల్లు. ఇప్పుడు తెలుసుకుందాం అనుకున్న అవి ఎట్లుంటయో ఎవరికీ ఎరుకలేకుండా అయిపోవట్టే.

"ఊరు మారిపోయింది. ఎవుసం పడావు పడ్డది.
ఈ ఊరు వదిలి పట్నం పోత. అక్కడేదన్న కూలినాలీ చేస్తనని పత్తిమిల్లుల్ల పనికి కుదిరిండు" రామసామి.
బతుకుదెరువు కోసం పట్నం పోయినా రామస్వామి అక్కడ ఉండలేక మల్ల ఊరికే వచ్చిండు.
"యుద్ధంలో లూటీపోయిన రాజ్యంలా కనపడ్డది రామసామికి ఊరు.
రాజ్యాన్ని పోగొట్టుకున్న రాజులా రామసామి, శిథిలమైన కోటలా ఊరు.
ఊరే పడావుపడ్డదంటే, ఇగ మాదిగవాడ సంగతైతే చెప్పవశం లేదు. మనుషులతో పాటు, ఇండ్లు కూడా ఆగమాగమైనై. బతికుంటే బలుసాకు తిని అయినా బతకొచ్చని తలోదిక్కు బతకపోయిన్రు." గిట్ల పల్లె బతుకులు ఎట్లా ఆగమైతున్నయో ఈ కథలో చెప్పిండ్రు.

భూములు ఉన్నోళ్లయి ఒకతీరు బాధలైతే, భూమి లేక కాయకష్టం చేసుకునే కూలీల బతుకు ఒకతీరు. గుంట భూమికోసం పడే తాపత్రయం, దొరలు ఎట్లా భూమిని గుంజుకుంటరో. ఆ మోసాలను, అన్నాలాన్ని 'ఉసురు' అనే కతతోటి మన కండ్లకు కట్టిన్రు పర్కపెల్లి యాదగిరి గారు. "మన జాగ అయినా భయపడవడిమి. వాడ్ని బిచ్చమెయ్యమని దేబురియ్య వస్తిమి. మన తెలంగాణల మనం పరాయిబత్కు బత్కవడిమి. మన తెలంగాణోడు మనల్నే దోస్కోవట్టె గదా. తెలంగాణ జిట్టపులి తెలంగాణ దుప్పిని తింటలేదా. అది కొసు మరిగిన ముర్గం ఈడు రూపాల రుచిమరిగిన ముర్గం".

పరాయోని పాలనకింద ఉన్న మనకు అన్నాలమే జరిగింది. గిప్పుడు మన రాష్ట్రంల కూడా పెద్దపెద్ద భూసాములదే పై చేయి.

ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.16-22


**2). ఛిద్రమైన వృత్తులు:**

ఆచారంగానో అలవాటుగానో, బతుకుదెరువో, అగ్రవర్ణాల ఆధిపత్యమో, అన్నింటినీ కలుపుకుంటే మొత్తానికి ఏ యే కులపోల్లు ఆయా కులం పనులు చేసేటోళ్ళు. సదువుకున్నోళ్ళయితే కులవృత్తులు పక్కకు వెట్టి వారి వారి అస్తిత్వాలను కాపాడుకునే ప్రయత్నం చేసింగ్రు. 'బత్తెం' కథలో ఇట్లాంటి పరిస్థితినే 'గాదె వెంకటేష్' చెప్పుకొచ్చింగ్రు. సదువుతో మన బతుకులు మార్చుకోవాలే గానీ మన వృత్తుల్ని మనం మరువద్దు. ఈ వృత్తులు కూడా ఆధిపత్యం చెలాయించేటోళ్లు నిర్ణయించిగ్రు గాని వీటిలో ఉన్న కళల్ని మనం మర్చిపోకుండా, ఎప్పటికప్పుడు నెమరేసుకోవాలె.

వెంకటేశం బాగా సదువుకుని ఉద్యోగం చేస్తున్నప్పటికీ, తండ్రి వంతుగా పాలోల్ల దగ్గరికి డప్పు కొట్టనికి పోయి 'బత్తెం' తీసుకొచ్చిన్డు. చిన్నతనం అనిపించినప్పటికీ తనకు తానే సర్దిచెప్పుకున్నాడు.' కులం నాకిచ్చిన కళ. నా వాళ్లంతా ఇట్లా ఎన్ని ఏండ్లుగా చిర్రా చిటికెనలు ఆడిస్తూ పొట్ట పోసుకున్నరో... నేనెందుకు సిగ్గుపడాలె. ఈ కళ పట్ల ఇతరులకు గౌరవం లేకపోవచ్చు. కానీ నాకు గుండెలనిండా పాయిరమేనాయే. ఎవ్వడు ఏమన్న అనుకోనీయ్.. మళ్లా సిర్ర అందుకొని దరువుల కలుపుతున్న. చిర్రెటో, చిటికెన ఏలెటో పోతుంది. నాయిన వంతు నిలబెడుతున్నందుకు సంతోషపడాలె. ఎందుకు నేను నామూష్ కావాలె. డప్పు నాది, ఊరు పాలు నాది.... నేను ఆనాడు డప్పు కొట్టి వెన్నెల తెలుగు అయ్యా మొఖం మల్ల ఎన్నడూ చూడలే

**3). నీళ్ళగోస:**

కరువొచ్చినప్పుడు ఎంత దరిద్రమైన బతుకుంటదో "బిందెడు నీళ్ళు" కథలో పెద్దింటి అశోక్ కుమార్ గారు చూపెట్టిగ్రు. ఆకలిని ఏదో ఒకటి తిని తీర్చుకోవచ్చు. కానీ దూప నీళ్లతోటే తీర్తది. ఏ పని చేయాలన్నా నీళ్లుకావాలె. నీళ్లకష్టం వచ్చింది తారకి, ఆ వూరికి. ఏ ఇంటికి పోయినా గుక్కెడు మంచినీళ్లు దొరకలే బిడ్డల దూప చల్లార్చడానికి. "తిండికి కూలినాలి చెయ్యచ్చు. నీళ్లకు ఏంజేత్తం. తిండి కరువు కొందరిదేగని నీళ్ళ కరువు ఊరందరిదాయె... సుట్టమైతే బుక్కెడు బువ్వతినుగని సుక్కెడు నీళ్ళు అడుగకు" అని అందరూ అంటున్నరు.

ఊరు ఊరంతా నీళ్లకోసం అల్లాడుతుంటే ఊరిమీద కనికరం లేని దేవుడికి అభిషేకం అంటూ, నీళ్ల ట్యాంకర్లు తెప్పిచ్చిండు పూజారి. ఆశగా నీళ్లకోసం ఆడికి పోయిన తారకు మరో ముగ్గురు ఆడోళ్ల మీద పూజారి అగ్గిమీద గుగ్గిలంలా మండివడ్డడు. "నీళ్ల కరువు పోవాలనే రేపు శివునికి జలాభిషేకం చేస్తున్నం. నీళ్లను ఎంగిలి చేస్తే మహాపాపం. ఎన్ని పాపాలు చేసింగ్రో... ఇప్పటికే నీళు లేక చస్తున్నరు. ఈ పాపం కూడానా... పోంగ్రి అంటూ గద్దిరించాడు".

ఎట్లనైనా బిందెడు నీళ్ళు సాధించి, బిడ్డల ఆకల్ని తీర్చేదే లక్ష్యంగా పెట్టుకుని అర్ధరాత్రి దొంగతనంగా గుడిలోకి పోయి నీళు దొంగతనం చేసి, తప్పించుకుని పోయే క్రమంలో పూజారి కంటపడింది. పూజారి వెంబడిస్తూ, తార మీద మన్నెత్తి పోస్తూ, రాళ్ళతో కొడుతుంటే తప్పించుకునే క్రమంలో నెత్తికి రాయి తగిలి రక్తం బిందెలోకి కారింది. సోయి తప్పి సగం బిందెడు నీళ్లతో ఇంటికొచ్చి కూలబడ్డది.

'ధూ... నీళ్ళు ఎర్రగా ఉన్నాయ్'

ఛీ... ఇవి నీళ్ళు కావు... రక్తం...' అని బిడ్డలు నీళ్లు తీసి మొహాన కొట్టేసరికి కొట్టేసరికి తేరుకుంది తార. గుక్కెడు నీళ్లకోసం పడ్డ తాపత్రయం చివరికి రక్తధారైంది.

**4). వలస బతుకులు:**

# సాహిత్య తరంగిణి
## (తెలుగు పరిశోధన పత్రిక)
ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.16-22


వలస బతుకులకు కేరాఫ్ గా నిలిచింది తెలంగాణ. దుబాయ్, బొంబాయి, అరబ్ దేశాలకు బతుకుదెరువు కోసం వలసపోయే స్థితికి దిగజారింది. సొంతదేశంలో పని దొరకక, పనికి తగిన వేతనం దొరకక, కొందరు అవసరార్థం, మరికొందరు గౌరవార్థం పరాయి దేశానికి వలసపోయి, తిండికి, బట్టకు నానా అవస్థలు పడుతున్న సన్నివేశాలు మనం చూస్తనే ఉ న్నాం. ఇటువంటి సన్నివేశాల్ని "చివరిచూపు" కథతో కే.వి. నరేందర్ గారు హృద్యంగా చిత్రీకరించారు. పనికోసం ఏజెంట్ చేతిలో మోసపోయి పరాయి దేశంలో పోయిన సుధాకర్ ని అక్రమ వలసదారు (ఖలివెల్లి) గా అక్కడి ప్రభుత్వం గుర్తించింది. ఎవరికంటా కనపడకుండా పోచయ్య, జలపతి అనే ఇద్దరు సుధాకర్ ని చేరదీస్తారు.

"ఇక్కడికి రాకుంగ్రిరా అంటే వినరు. ఇక్కడ ఏదో పెట్రోల్ బావులు తోడుకొని అమ్ముకోవచ్చన్న ఆశగా వస్తారు. ఇక్కడ మనల్ని చంపుతారు". అని జలపతి మాటల ద్వారా నిజాన్ని చెప్పిండు. కథలో మూడు సన్నివేశాలు గుండెను బరువెక్కిస్తాయి. పోచయ్య దోస్తు నారాయణ కంకర ట్యాంకర్ల చచ్చిపోవడం, పనికోసం పోయిన చోట చనిపోయిన వాళ్లను సొంత ఊరికి పంపనీకి ఎంత తతంగం ఉంటదో జలపతి మాటల్లో చెప్పించడం, సుధాకర్ అమ్మ చనిపోవడం.

సుధాకర్ 'ఖల్లివెల్లి'గా దొరికిండని తెల్సి గుండెపలిగి వాళ్ళమ్మ చనిపోయింది. అది తెలుసుకున్న సుధాకర్ అమ్మ ఆఖరిచూపు కోసం తల్లడిల్లడం గుండెను కరిగిస్తుంది పాఠకునికి. చివరికి అమ్మ చివరిచూపు కూడా చూడలేడు.

ఒక్కసారి కన్పించవే... ఒక్కసారి నాకు కన్పించమ్మా".. అంటూ పలవరిస్తున్నాడు సుధాకర్.

"గుండె పగిలిన సుధాకర్ దుఃఖం.... దేశ సరిహద్దుల్ని తాకుతోంది..."

**5). మత సంఘర్షణ:**భారతదేశం భిన్న కులాల, మతాల, సంస్కృతుల సమ్మేళనం. భిన్నత్వంలో ఏకత్వంగా ప్రసిద్ధి. పేరుగాంచిన దేశంలో ఇప్పటికీ కొన్ని కొన్ని కులాల్ని, మతాల్ని నీచంగా, హీనంగా చూసే ధోరణిని మనం చూస్తున్నాం. ముఖ్యంగా మైనారిటీలు అంటే 'దేశద్రోహులు' అనే భావనతోనే చూస్తున్నరు. అట్లాంటివి ఈ కథా సంపుటిలో కొన్ని కథలు వాళ్ల పట్ల ఒక్కొక్కరికి ఎసొంటి దృష్టి ఉందో చూపించినయి.

'బిల్లి' కథలో షాజహానా గారు రెహనా, దాక్షాయణి పాత్రల ద్వారా మనుషుల మనస్తత్వాలు, ముస్లింల పట్ల ఉన్న చిన్నచూపు పేర్కొంది. బ్రాహ్మణ కుటుంబంలో దాక్షాయణి, పక్కనే ఇంట్లో అద్దెకు రెహానా కుటుంబం ఉండేది. దాక్షాయణి ఇంట్లో పిల్లి ఒకరోజు మాంసం వాసనకు రెహనా ఇంటికి వెళ్లి మాంసం తింటది. అది చూసిన దాక్షాయణి పిల్లిపై, రెహనా పై నోరు పారేసుకుంటుంది.

"ఇన్నిరోజులూ చక్కగా పాలు, పెరుగు పోసి పెంచాను. ఛండాలపు తిండి పెట్టి మా పిల్లిని అపవిత్రం చేసిందే. అయినా వెనకా ముందు చూసుకో అఖ?ర్లా? ఎవరి పెళ్లి ఏంటి అని, మా ఇంట్లో పిల్లలతో సమానంగా పెరిగిన పిల్లి. మడి, ఆచారం అన్నీ ఔపోసన పట్టిన పిల్లి అది... ఇన్నాళ్ల దాని నిష్ఠని ఒక్కరోజులో గంగలో కలిపింది కాదు... అయినా ఆ ఓనర్ కి ముందు నుంచి చెప్తూనే ఉన్నాము, తురకలకి అద్దివ్వద్దనీను. అయినా వింటేనా... వెధవకి డబ్బు ఆరాటం. అయినా రానీ.. అతని సంగతీ తేలుస్తాను" చేతులు తిప్పుతూ ఆవిడ రెహనాని కడిగేసింది ఇంకా చాలా మాటలతో.

మనుషులంతా ఒక్కటే ఈ కులాలు మతాలు కట్టుబాట్లు అన్ని మనం సృష్టించుకున్నవే అనే కలలో రెహానా ఉపన్యాసం ఇస్తుంది. "పిల్లులన్నీ మాంసం తినేవే కానీ కొన్ని పిల్లలు కొన్ని కట్టుబాట్లు పెట్టుకుని మానేసినై. అన్నీ ఒక్కలాగే ఎందుకుండాలి, వాటికంటే మనం గొప్పవిగా కనపడాలని. అయితే వాటి జీన్స్ లో మాంసం తినే ఆనవాళ్ళు ఆ కోరిక గుప్తంగా ఉండి అవకాశం వచ్చినప్పుడు

బయటపడతాయి". ఆమె ఉపన్యాసం ముగియకుండానే వేదిక నలుగువేపుల నుండి జందెం పిల్లలు దాడి చేశాయి. వేదిక కూలి రెహానా మీద పడింది. కెవ్వుమని అరిచింది రెహానా.

ముస్లిం అంటే ఉన్న వెటకారపు ధోరణిని "సాహిల్ వస్తాడు" కథలో అఫ్సర్ ఎర్కచేసిండు. రాము, ఫణి, సాహిల్ ముగ్గురు ప్రాణ స్నేహితులు. ఒకరికి తెలియకుండా మరొకరి తానా ఏ విషయాలు ఉండవు. ఒకనాడు సాహిల్ కనిపించకుండా పోతడు. రాము, ఫణి సాహిల్ ని లెంకి లెంకి ఆఖరికి దొరకకపోతే పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇయ్యనీకి పోతరు. స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడిన మాటలు రాముకి మనసులో బాణం గుచ్చినట్టయితది.

"వొక్క విషయం చెప్తాను. అతను ముస్లిం, మీరు హిందువులు అతనిది ముస్లిం మైండ్! అంటే violent. అంత తేలిక కాదు అర్థం చేసుకోవడం అది వొక మిస్టరీ! మీకు తెలియని లైఫ్ అతనికి చాలా ఉండి ఉంటుంది. ఇన్ని బాంబు బ్లాస్ట్ లూ, బస్సులు తగలబెట్టడాలూ, చావులూ, హత్యల తర్వాత కూడా మీకీ విషయం అర్థం కాకపోతే మీరు వొట్టి అమాయకులైనా అయి ఉండాలి, లేకపోతే, వొక తెలివైనమాయలో ఇరుక్కొని ఉండాలి". ముస్లిం అనే కారణంతో ఆలోచన దృష్టి ఎట్లుంటదో ఈ కథలో సూపిన్రు. "మతం అనేది చివరికి కలహ కారణంగానే మిగిలిపోయిన ఈ రోజువారి హింసలో.."

ఇస్వంటిదే స్కైబాబా గారు రాసిన "అంటు" కథ. రేష్మా, సురేష్ ప్రేమించుకొని పెళ్లి చేసుకుందామని ఊరు విడిచిపెట్టి ఉస్మానియా క్యాంపస్కి వచ్చిన్రు. ఆడ ఈళ్ళకి దోస్తులు ఉన్నరు. కొట్లాటలు అయితున్న క్రమంలో నడిమిట్ల యూసుఫ్, భరత్, రాజు ఇంకా కొంతమంది మధ్యవర్తిత్వంతో రేష్మ తల్లిదండ్రులు ఇల్లు ప్రేమని ఒప్పుకొని మేము పెళ్లిచేస్తాం, కానీ మా మతంలో జరిగినట్టు నిఖా చేస్తాం దానికి నువ్వు "సున్తీ" చేయించుకోవాలని సురేష్ కి చెప్తరు. "అంటే వాడికి సున్తీ చేయించి వాణి ముస్లింగా మారుస్తరా? అంటే రేపు వాన్ని అందరూ తీవ్రవాదిగా సూస్తానికా?" అని రాజు అన్న మాటలకు యూసుఫ్ ఆశ్చర్యపోయి "అంటే నీకు ముస్లింలందరూ తీవ్రవాదుల్లెక్క కనిపిస్తున్నరా?" అడిగిండు విసురుగా.... ఈ ఒక్క మాట చాలు ముస్లింల పట్ల ఏ విధమైన భావం ఉందో తెల్వనీకి. సురేష్ సున్తీ చేయించుకోనికి భయపడుతడు. ఒప్పుకోడు. ఎవరికీ చెప్పకుండా దోస్తులను కాదని ఎక్కడికో వెళ్లిపోతారు.

**6). దళితులపై దమనకాండ:**

ఒక దళితులపై అగ్రకులాల కన్ను ఎట్లుంటదో "నల్లజెండా" కథతోని 'జూపాక సుభద్ర' గారు సూపెట్టిన్రు. పోషన్న దళితుడు, సదువుకున్నోడు. అందరినీ మంచిగ పల్కరించెటోడు. పోలీస్ ఇన్ఫార్మర్ అని చెప్పి రెడ్లుఅన్నాలంగా ఊరి మధ్యలో అన్నలతో సంపేపిస్తరు. శాంతక్క మీటింగులో ఈ దారుణాన్ని నిలదీస్తుంది.

"అన్నంలేనోడు దొంగ ఆల్లేనోడు లంగ తీరు మమ్మల్ని సమాజం జూస్తుంది. సమ సమాజాన్ని తెస్తమనే అన్నలు గూడ అదేబాట బట్టిండ్రు. సంపదల్నుకుంటే 'ఇన్ఫార్మర్' అని ముద్రేస్తే సేతికి మట్టంటదని అనుకుంటుండ్రు, ఎన్కౌంటర్ లెక్కలు దియ్యండ్రి. సచ్చుడు కాడ గూడ కులమెట్లున్నదో అర్థమైతది. ఇన్ఫార్మర్ పేరుతోని దళిత కులాల్ని చాలా మందిని అన్నలు ప్రజాకోర్టు పేరుమీద సంపిండ్రు. అదే పెద్దకులం ఇన్ఫార్మర్లని ఎంతమందిని ప్రజాకోర్టుల సంపిండ్రో ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకొమ్మని విన్నవిస్తున్నాను". అన్నల పార్టీ వాళ్ళు అసలు ఏం జరిగిందో తెల్సుకుని అన్యాలంగా రెడ్ల మాట విని ప్రాణం తీసిన పోషన్నను సంపిచ్చినోళ్లను సంపేస్తరు.

ఇట్లాంటిదే కక్షగట్టి, నిందలేసి సంపనీకి సూసుడు అనేది "బుగాడ" కథలో 'బూతం ముత్యాలు' గారు చెప్పిండ్రు. దొంగతనాలు గిట్ల ఏమన్న జరిగినా బుడ్డయ్య ఎదురింట్లో ఉండెటోని మీద ఏస్తరు. జమిందార్ మీద పోలీసులకు చెప్పిండని జమీందారు గీ పుకార్లను లేపి, ఆన్ని సంపేయాలని సూస్తడు.

# సాహిత్య తరంగిణి
## (తెలుగు పరిశోధన పత్రిక)
**ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)**
**A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.16-22**


"కాపోనిపగ కాట్కి లెక్క, పోలీసోని పగ పైకే సచ్చినంక యమలోకంల ఎన్ని శెరలుంటాయో ఎర్గంగాని, గీ కొడ్కులు ఆళ్ల మతిల పడ్తా మనుండగనే అన్ని రకాల శెరలు జూప్తరు. అందినకాడ్కి లంచాలు మింగరు. ఆళ్ళ ఎద్రిస్తోడెవడు. ఏదిలేకున్నా, ఏదో ఓ కేసుల ఇర్కిచ్చి ఇర్గ సంప్తరు".

ఆ కాలంల్లనే కాదు ఇప్పుడు కూడా ఇసొంటివి మస్తుగనే చూస్తున్నాం. పేదోడన్న, దళితులన్నా చిన్నచూపే.

**7) ఆత్మ గౌరవం:**

ఆడపిల్ల తన కాళ్ళ మీద తాను నిలబడి బత్కుతదని "సంగీత" కథతో కవిత గారు తెలియజేసిన్రు. పెద్దన్న సహాయంతో పీజీ వరకు సద్విన సంగీతకు పెండ్లి చేసింన్రు. మంచోళ్ళు అనుకున్న అత్త మామ గారిల్లు బయటికి కనిపించేంత మంచోళ్ళు కాదని తెలిసింది. "ఇంట్లో నుండి బయటకు వెళ్ళేది లేదు. ఎవరితో మాట్లాడనిచ్చేవారు కాదు. ఒక రకంగా గృహనిర్బంధం. పుట్టింటితో సంబంధం తెగిపోయినట్టేనని నాకు ఆర్నెల్లలోనే తెలిసి వచ్చింది". ఇదంతా తెలుసుకున్న పెద్దన్న "ఆ ఇంటికి సంగీతను పంపితే దాని శవం కూడా తిరిగి రాదు మనకి" అని చెప్తడు.

సంగీత మొగునికి లేని అలవాటంటూలేదు. ఆడి నుంచి తప్పించుకుని తన పిల్లల్తో పెద్దన్న తానికి వచ్చే ప్రైవేట్ టీచర్ గా చేస్తూ కాలం ఎళ్లదీస్తుంటే, "ఆమె భర్త ఆరోగ్యం బాగాలేదని, పెరాలిసిస్ వచ్చి మాట, చెయ్యి, కాలు పడిపోయాయి. నేను ఇంట్లో నుంచి వెళ్లిపోయాక మరో పెళ్లి చేసుకున్నాడు. కాని, ప్రస్తుతం ఆ అమ్మాయి ఇతనితో కాపురం చేయనని వదిలేసి వెళ్ళిపోయింది. చట్టప్రకారం విడాకులు కాలేదు. కాబట్టి నేను అక్కడికి వెళ్ళాలి. అంతేకాక, ఇప్పుడు ఆ కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయట. ఈ సమయంలో నా సాయం అడగటానికి వచ్చారట".

బీరువాలో నుండి 3000 రూపాయలు తీసుకొని వాళ్ల ముందుపెట్టి, "ఇది ఉంచండి. ప్రస్తుతం అతని వైద్యానికి పనికి వస్తుంది. ఇక సెలవు. నాకు ట్యూషన్ పిల్లలు వచ్చే టైం అయింది" అంటూ లోనికి వెళ్ళింది. సంగీత భావం తెలుసుకున్నవాళ్ళు లేచి వెళ్ళిపోయారు. ఆత్మగౌరవాన్ని చంపుకుని వెళ్లలేక, సమాజంలో తనకంటూ ఒక జీవితాన్ని నిర్మించుకుంది సంగీత.

**8) ఇతర అంశాలు:** పట్టణీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలో భాగంగా పల్లెలు పట్నాలు అయితున్నయి. వలస బతుకులు ఎక్కువైతున్నయి. రియల్ ఎస్టేట్ మనిషిని ఏలుతుంది. 'అమ్మబోతే అడవి కొనబోతే కొరివి' అన్నట్టుగా భూముల క్రయ, విక్రయాలు జరుగుతున్నయి. ఈ విషయాలను "పరాయి గ్రహం" అనే కథల 'బెజ్జారపు రవీందర్' గారు చెప్పింన్రు.

లలిత, చందూ వారి బడ్జెట్లో ఒక చిన్నప్లాట్ తీసుకోవాలి అనుకుంటరు. కొన్ని భూములు ఎట్లా రేట్లు పెరిగి ఎంతమంది జీవితాలను చిత్రం చేస్తున్నాయో తెలిపిండు. ఏమీ లేనోళ్ళు కూడా రియల్ ఎస్టేట్ దందాల కలిసివచ్చి ఏ స్థితికి చేరుకున్నరో చెప్పిండు. "దొంగనా కొడుకుకి ఎంత సిరి వచ్చిందో చూసినావా? వాడొక మెకానిక్. నేను టీవీఎస్ చాంప్ మెయింటేన్ చేసే రోజుల్లో పైసాపైసకు దేవులాడెటోడు. మేము తాగిపిస్తే తినిపిస్తే బతికినోడు. రేకుర్తిల అయ్యవ్వలు ఇచ్చిన భూమి ఉండే కొంత. రియల్ ఎస్టేట్ దందాలకు దిగిండు తెల్ల బట్టలేసిండు. మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ దోస్తానా ఇప్పుడు". భూములు, ప్లాట్లు ఉంటే గౌరవంగా చూసే ఈ రోజుల్లో "ఈ సమస్త భూమండలం మీద తనకు ఒక ప్లాటు దొరుకుతుందో లేదో అని ఆశ్చర్యపడ్డాడు చందు".

కబ్జాకు గురైన స్థలాన్ని విద్యార్థులను చైతన్యపరిచి ప్రిన్సిపాల్ ఝాన్సీ ఏ విధంగా తిరిగి పొందిందో 'చెన్నూరి సుదర్శన్'గారు "ఝాన్సీ హెచ్.ఎం" కథలో ఆలోచనాత్మకంగా చెప్పింన్రు. పల్లెటూల్లో ఎట్లా మారిపోతున్నాయి. "మర్రిచెట్టు" కథ ద్వారా 'మన్నె ఏలియా' గారు చిత్రీకరించారు.

ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.16-22

**ఆధార గ్రంథాలు:**

1. మల్లయ్య,కాలువ. తెలుగు ప్రగతిశీల కథా సాహిత్యం. సామాజిక భారత్ ప్రచురణలు. హైదరాబాద్,1982
2. తిరుపతి, భూక్య, సమకాలీన తెలుగు సాహిత్యం -సమాలోచనం. స్వీయప్రచురణలు. కుప్పం. 2019
3. బాలగంగాధర తిలక్, దేవరకొండ, తిలక్ కథలు. విశాలాంధ్ర పబ్లిషింగ్హౌస్. గుంటూరు. 1986
4. విశ్వనాథశాస్త్రి, రాచకొండ, ఆరుసారాకథలు, విజయబుక్స్, విజయవాడ .1987